సాక్షి
మెదక్
బుధవారం : 22 : మార్చి : 2023



హోటల్ ఫుడ్‌తో అస్వస్థత
నర్సాపూర్‌లోని ఓ హోటల్‌లో బిర్యాని తిన్న పలువురు అస్వస్థతకు గురయ్యారు. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు అధికారులు హోటల్‌లో శాంపిల్స్ సేకరించారు. 8లో



దీవించమ్మా.. బట్టమ్మ తల్లి
ఉగాదిని పురస్కరించుకొని కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో నిర్వహించే బట్టమ్మ తల్లి జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. 8లో



పౌష్టికాహారం అందించాలి
పోషకాహారంతో ఆరోగ్యంగా ఉంటారని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. 9లో

న్యూస్‌రీల్

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరిస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

నర్సాపూర్: తెలుగు నూతన సంవత్సరం పంచాంగాన్ని రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి మంగళవారం ఆవిష్కరించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సాపూర్ డివిజన్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని శోభాక్రుత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్ శర్మ, కార్యదర్శి మాణిక్‌శర్మ, మధుశ్రీ, మురళీధర్‌శర్మ, జయదేవాచార్య, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

వెల్దుర్తి(తూప్రాన్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని నెల్లూర్ గ్రామానికి చెందిన భిక్షపతిగౌడ్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.25 వేల చెక్కును మంగళవారం ఆమె అందజేశారు. ఆపదలో ఉన్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు

జిల్లా విద్యాధికారి రాధాకిషన్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు సాధించగలరని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో ఫలితాల్లో వచ్చే గ్రేడ్ భవిష్యత్‌లో విద్యార్థుల ప్రగతికి ప్రమాణికంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం గురించి హెచ్ఎం విశ్వనాథంను అడిగి తెలుసుకున్నారు.

నీటిని వృథా చేయొద్దు



మిషన్ భగీరథ అధికారులతో చీఫ్ ఇంజినీర్

నర్సాపూర్: నీటిని అవసరం మేరకే వినియోగించాలని, వృథా చేయొద్దని మిషన్ భగీరథ రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ విజయ్‌ప్రకాష్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని బీవీరాజు ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి నీరు ఎంతో అవసరం అన్నారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా ద్వారా శుద్ధి చేసిన నీటిని అందిస్తున్నామన్నారు. మిషన్ భగీరథ పథకం పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రఘువీర, డీఈఈలు ప్రవీణ్‌కుమార్, కిషన్, కాలేజీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబె, మేనేజర్ బాపిరాజు, హెచ్ఓడీ డాక్టర్ కృష్ణరావు పాల్గొన్నారు.

నలుగురికి కరోనా



మెదక్‌జోన్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం 73 మందికి కరోనా పరీక్షలు చేయగా అందులో నలుగురికి పాజిటివ్ వచ్చినట్లు జిల్లా వైద్యాధికారి చందునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణంలో ఒకరికి, పాపన్నపేటలో ఒకరికి, హవేళిఘనాపూర్ మండలం సర్దనలో ఒకరికి, చిన్నశంకరంపేటలో ఒకరికి మహమ్మారి సోకినట్లు పేర్కొన్నారు.

కిస్తీ.. నెలనెలా కుస్తీ



మెదక్‌జోన్: ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె శంకరంపేట మండలం మల్లుపల్లి సర్పంచ్ లక్ష్మీశంకర్. ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్య పనుల నిర్వాహణ కోసం 2020లో పంచాయతీ అకౌంట్లో ఉన్న రూ.3 లక్షలతో కలిపి బ్యాంకులో రూ.3 లక్షలు అప్పుచేసి ట్రాక్టర్ కొనుగోలు చేసింది. వీటితో పాటు మరో రూ.3 లక్షలు ప్రైవేటుగా అప్పు చేసి ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు చేసింది. అయితే ప్రతిమూడు నెలలకోసారి బ్యాంకులు రూ.31,280 కిస్తీ చెల్లించాల్సి ఉంది. అయితే ఆరు నెలలుగా పంచాయతీల అభివృద్ధికి నిధులు రాకపోవటంతో కిస్తీ కట్టలేని పరిస్థితి ఎదురైంది. బ్యాంకు అధికారులు తరుచూ ఫోన్లు చేస్తున్నారని, తన వ్యక్తిగత పనులకు సైతం బ్యాంకుకు వెళ్లలేని పరిస్థితి ఎదురైందని వాపోతోంది. ఇది ఒక్క లక్ష్మి పరిస్థితే కాదు. జిల్లాలో చిన్న పంచాయతీలకు చెందిన 187 మంది గ్రామ ప్రథమ పౌరుల ఆవేదన.



మల్లుపల్లి పంచాయతీ ట్రాక్టర్

చిన్న పంచాయతీలకు పెద్ద చిక్కు
- అప్పులు చేసి ట్రాక్టర్ల కొనుగోలు
- ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు

- 320 పంచాయతీలుగా ఉన్న మెదక్ జిల్లా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019లో గిరిజన తండాలతో పాటు 500 జనాభా ఉన్న మధిర గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటైన 149 పంచాయతీలతో కలిపి వీటి సంఖ్య మొత్తం 469కి చేరుకుంది.
- 2020లో చెత్తసేకరణ కోసం ప్రతి పంచాయతీకి ఒక ట్రాక్టర్ ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రతి గ్రామంలో ఒక్కో సర్పంచ్ సుమారు రూ.9 లక్షల నుంచి రూ.10 వెచ్చించి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు చేశారు.
- జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు నెలనెలా నిధులు రావటంతో 282 మేజర్ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు మొత్తం డబ్బులు చెల్లించి వీటిని కొనుగోలు చేశారు. అయితే మిగతా 187 చిన్న పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు మాత్రం బ్యాంకుల్లో అప్పులు చేశారు. ప్రతి మూడు నెలలకోసారి కిస్తీ(ఈఎంఐ) చెల్లిస్తామనే ఒప్పందంతో వీటిని కొనుగోలు చేశారు.
- మొదట్లో ప్రతి నెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయటంతో అటు బ్యాంకుల్లో ప్రతి మూడు మాసాలకోసారి కిస్తీ చెల్లిస్తూ వచ్చారు. అలాగే పారిశుధ్య కార్మికులకు సైతం వేతనాలు చెల్లించారు.

ఆరు మాసాలుగా అవస్థలే..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆరు నెలలుగా నిధులు సక్రమంగా రాకపోవటంతో కిస్తీలు కట్టలేని పరిస్థితి నెలకొంది. పారిశుధ్య కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించలేక, డీజిల్ ఖర్చుల కోసం సైతం అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, కిస్తీల చెల్లింపు ఇబ్బందిగా మారిందని సర్పంచ్‌లు వాపోతున్నారు. బ్యాంకు అధికారులు ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించాలని ఫోన్లు చేస్తుండటంతో సమాధానం చెప్పలేక ఫోన్ ఎత్తడం లేదని చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు పల్లెలకు వచ్చినప్పుడు తమ గోడును చెప్పుకుంటూ సమస్య పరిష్కారానికి నిధులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

నిధుల విడుదలలో జాప్యం

- గ్రామాభివృద్ధికి ప్రతినెలా రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి. కానీ ఇవి ఆరు నెలలుగా విడుదల కాకపోవటంతో సర్పంచ్‌లు నానా అవస్థలు పడుతున్నారు.
- గ్రామాభివృద్ధి కోసం ఇచ్చే నిధులను కేవలం అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు, ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేయకుండా చర్యలు తీసుకున్నారు.
- నెలనెలా పన్నులు వసూలు అవుతున్న మేజర్ పంచాయతీలు, పరిశ్రమలు ఉన్న పంచాయతీలకు కిస్తీల బాధ లేదు. కానీ చిన్న పంచాయతీలకు ఆదాయం లేక ట్రాక్టర్ల కిస్తీలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయలేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యను గుర్తించి నిధులు విడుదల చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు.

నర్సరీల పర్యవేక్షణ పట్టదా?

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆగ్రహం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, నర్సరీల ఏర్పాటు, నిర్వహణపై సమీక్షలు నిర్వహిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నా ఇంత అధ్వానంగా నిర్వహణ ఏంటని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీలపై నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఎఫ్ఏలకు నోటీసులు జారీ చేయాలని ఇన్‌చార్జీ ఎంపీడీఓను ఆదేశించారు. మంగళవారం అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిల్వెర, మందాపూర్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. మందాపూర్ నర్సరీలో పది వేల మొక్కలకు ఐదు వేలు కూడా లేకపోవడమేమిటని ప్రశ్నించారు. చిల్వెర నర్సరీలో సహితం మొక్కలు అంతంతమాత్రంగానే ఉండటంపై కార్యదర్శిని నిలదీశారు. ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల్లో మహిళా ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెటిందని, ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సయ్యద్, డాక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’పై అశ్రద్ధ వద్దు

టేక్మాల్(మెదక్): కంటి వెలుగు కార్యక్రమంపై అశ్రద్ధ చూపితే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని హెచ్ఎంపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరం, నర్సరీ, దళితబంధు ద్వారా అందించిన యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటివెలుగులో వైద్యులు సమయ పాలన పాటిస్తూ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి నర్సరీలో టార్గెట్‌కు మించి మొక్కలను కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. దళితబంధులో పూర్తికాని యూనిట్లను గ్రౌడింగ్ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట సర్పంచ్ లావణ్యారెడ్డి, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ రియాజొద్దీన్, ఏపీఓ పాలు, ఏపీఎం గోపాల్, హెచ్ఈఓ సుగుణాకర్, కార్యదర్శులు రాకేశ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రతిమాసింగ్

బగలాముఖి శక్తిపీఠంలో అమావాస్య పూజలు



మహామంత్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ అమ్మవారి శక్తిపీఠంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉపాసకులు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు అమావాస్య పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థలదాత పబ్బ స్వరూపరమేశ్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు. బగలాముఖి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం నా బాధ్యత అని శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల వాసి, ప్రముఖ గాయకుడు, లిటిల్ మ్యుజీషియన్ అకాడమి వ్యవస్థాపకుడు కోమాండూరి రామాచారి అన్నారు. అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాహుబలి - 2 ఫేమ్ గాయకులు సోని కోమాండూరి, శ్రీ సౌమ్య వారణాసి ఆలపించిన భక్తి గీతాలు ఎంతగానో అకట్టుకున్నాయి.

పాత నేరస్తులపై నిఘా ఉంచాలి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

చేగుంట(తూప్రాన్): పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఎస్పీ రోహిణీప్రియదర్శిని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చేగుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసులతో మాట్లాడుతూ పాత నేరస్తులపై నిఘా పెంచాలన్నారు. ప్రతిరోజూ కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇతర పత్రాలు వెంట తెచ్చుకునేలా అవగాహన పెంచాలన్నారు. డయల్ 100 కేసులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చేగుంట ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్యం అవసరం



కోనాయపల్లి చెరువు వద్ద మత్స్యకారులు

మనోహరాబాద్(తూప్రాన్): చేపలు పట్టే వారికి వృత్తి నైపుణ్యం చాలా అవసరమని మత్స్యశాఖ జిల్లా అధికారి రజని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కోనాయపల్లి(పీటీ) చెరువు వద్ద కోనాయపల్లి(పీటీ), ధర్మరాజ్‌పల్లి, చెట్లగౌరారం, తూప్రాన్ మండలం వట్టూర్, వెంకటాయపల్లి గ్రామాల మత్స్యకారులు 200 మందికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్య సర్టిఫికెట్ కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారని, వారికి అర్హత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అర్హత పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. వీరి వెంట బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న రైతులు

డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ

కౌడిపల్లి(నర్సాపూర్): చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, రైతులు చిరుధాన్యాల పంటలను సాగు చేస్తూ భోజనంలో వాటిని చేర్చుకోవాలని డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ అన్నారు. మండలంలోని తునికి కేవీకేలో మంగళవారం సీనియర్ సైంటిస్ట్, హెడ్ సంబాజీ దత్తాత్రేయ నల్కర్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి సేద్యం, చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ, నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి, నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమభార్గవి మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంలో ఒకటి లేదా రెండురోజులు చిరుధాన్యాలతో భోజనం పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలన్నారు. అనంతరం శోభారాణి మాట్లాడుతూ వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన రాగులు, సజ్జలు, కర్రలు, అండుకొర్రలు, ఇతర చిరుధాన్యాలు పండించాలన్నారు. అనంతరం కేవీకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. పలువురు రైతులకు సేంద్రియ సాగుకు అవసరమైన డ్రమ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి డైరెక్టర్ అర్జునరావ్, కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, డాక్టర్ భార్గవి, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మినీ పంచాంగం



కలెక్టర్ రాజర్షిషాకు మినీ పంచాంగం అందజేస్తున్న దృశ్యం

మెదక్ కలెక్టరేట్: మెదక్ డివిజన్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ రాజర్షిషాకు నూతన సంవత్సరం పంచాంగాన్ని అందజేశారు. శోభకృత్ నామ సంవత్సరంలో శుభ ముహూర్తాలు, పండగలు, గ్రహణాలు, పుష్కరాలతో సమగ్రంగా పంచాంగాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో సంఘం మెదక్ డివిజన్ అధ్యక్షుడు దేశాయిపేట లింగమూర్తి శర్మ, ప్రధాన కార్యదర్శి వైద్య శ్రీనివాస శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్య ప్రభాకర్ శర్మ, సంఘ బాధ్యులు శ్రీవాండ్ల సాయిబాబా, పోద్దార్ నరేందర్ బాబు, శ్రీభాష్యం మధుసూదనాచారి, శ్రీవాండ్ల శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఓ ప్రకటనలో కలెక్టర్ జిల్లా ప్రజలకు తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకంటూ లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఇంటర్ నోడల్ జిల్లా అధికారి సత్యనారాయణ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 31 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

286 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సర పరీక్షకు 286 మంది గైర్హాజరు అయినట్లు పరీక్షల కమిటీ అధికారి సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. సెట్ –బీ(మ్యాథ్స్, బోటనీ, సివిక్స్) పరీక్ష నిర్వహించగా జనరల్‌లో 5,781 విద్యార్థులకుగాను 5,512 మంది హాజరు కాగా 269మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 517 మందికి 500 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి



కలెక్టరేట్‌లోకి వెళ్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

- యువజన కాంగ్రెస్ నేతల డిమాండ్
- ఉద్రిక్తంగా కలెక్టరేట్ ముట్టడి

మెదక్ కలెక్టరేట్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై మంగళవారం మెదక్ పట్టణంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు డీసీసీ కార్యాలయం నుంచి నాయకులు ర్యాలీగా బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని కలెక్టరేట్ గేట్ల వద్దే ఆపాలని బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులకు, యువజన కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరగడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు ఏర్పాటు చేసిన కంచెలను దాటుకొని యువజన కాంగ్రెస్ నాయకులు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం మొత్తం మంత్రి కేటీఆర్ కార్యాలయం నుంచి జరిగిందని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే వార్తలు వచ్చాయని, ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా చెప్పారన్నారు. ఈ లీకేజీల వ్యవహారం అంతటికీ బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పేపర్ లీకేజీలపై సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కలెక్టరేట్ సిబ్బందికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మెదక్ అసెంబ్లీ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు రియాజ్ అలీ, నాయకులు శ్రీధర్, మహేష్, సంతోష్, మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, రాకేష్, సతీష్, అదిల్, రాజు, మధుసూదన్ రెడ్డి, ఉదయ్, భాను చందర్, రాజేందర్, దంసింగ్, సుధాకర్, కృష్ణ, శ్రీనివాస్, రాజు, రమేశ్, ఫసీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీకృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ చాంబర్ సీజ్



ప్రిన్సిపాల్ చాంబర్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సదాశివపేట(సంగారెడ్డి): మూడేళ్లుగా ఆస్తిపన్ను చెల్లించకపోవడంతో అధికారులు చర్య లు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ చాంబర్‌ను సీజ్ చేశారు. మూడేళ్లుగా రూ.6.40 లక్షలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఆస్తిపన్ను చెల్లించడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తుండటంతో చర్యలు చేపట్టామని కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి సహకరించాలనికోరారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



భార్గవ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ రాయరావు చెరువులో సోమవారం గల్లంతైన యువకుడి శవం మంగళవారం లభ్యమైంది. గజఈతగాళ్లతో గల్లంతైన భార్గవ్ (22) మృతదేహాన్ని వెలికితీసి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హైదరాబాద్ బోర బండకు చెందిన స్నేహితురాలితో కలిసి వచ్చి అర్బన్ పార్క్ తిలకించి పక్కనే ఉన్న రాయల చెరువులో దిగి గల్లంతైన సంగతి విదితమే.

డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని పలు చౌరస్తాల్లో మూడు రోజుల క్రితం పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పది మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి రూ.23 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు



యాదగిరి

రామాయంపేట(మెదక్): గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి నేరం రుజువు కావడంతో కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2017 అక్టోబర్ 27వ తేదీన మండలంలోని కుర్మపల్లి గ్రామానికి చెందిన నాగమల్లు యాదగిరి వద్ద 600 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాధాకిషన్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్‌చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం కోర్టులో వాదనల విన్న అనంతరం మెదక్ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి లక్ష్మీశారద నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధించారు.

దీవించమ్మా.. బట్టమ్మ తల్లి

- కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో నేడు బట్టమ్మ దేవి జాతర
- ఆలయం లేదు.. అమ్మవారి విగ్రహం లేదు
- నాలుగు వైపులా రాతి స్తంభాలు మధ్యలో చిన్న గోడ
- మట్టి బొద్దులు (గురుగులు) అమ్మవారిగా భావించి పూజలు
- ప్రతీ కుటుంబంలో ఒకరికి బట్టమ్మ, బట్టయ్య పేరు



కూకుట్లపల్లిలో రాతి స్తంభాల మధ్య బట్టమ్మదేవి ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం. మహిమగల తల్లిగా కొలిచే భక్తులు. కోరిన కోరికలు తీర్చే దేవత అంటూ అమ్మవారి పేరు కుటుంబంలో ఒకరికి పెట్టుకుని భక్తిని చాటుకున్నారు. అయితే అన్ని గ్రామాలలో ఉన్నట్లు అక్కడ ఆలయం లేదు, అమ్మవారి విగ్రహం లేదు. అయినా గ్రామస్తులు భక్తితో కొలుస్తారు. ప్రతీ ఉగాది పండగకు గ్రామస్తులంతా జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించి బండ్లు ఊరేగించి మొక్కులు తీర్చుకుంటారు. ఇది కౌడిపల్లి మండలం కూకుట్లపల్లి గ్రామ శివారులోనిపంట పొలాల్లో వెలిసిన బట్టమ్మదేవి ఆలయం చరిత్ర.

- కౌడిపల్లి మండలం కూకుట్లపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో బట్టమ్మదేవి ఆలయం ఉంది.
- వందేళ్లకు పైగా ఆలయానికి చరిత్ర కలిగి ఉంది.
- గ్రామానికి చెందిన కరణం వంశస్తులు బట్టమ్మదేవిని వారి వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- ఏటా ఉగాది నాడు జాతర చేస్తున్నారు.
- పటేల్, పట్వారీ, కరణం వ్యవస్థతోపాటు గ్రామ పంచాయతీలు సైతం జాతర జరుపుతున్నారు.

మహిమగల తల్లి బట్టమ్మదేవి

- బట్టమ్మదేవి మహిమగల తల్లి అని గ్రామస్తులు చెబుతారు.
- గ్రామస్తులు కొత్తగా ఏపని చేసిన అమ్మవారికి పూజలు చేస్తారు.
- అమ్మవారి దయతో పంట పొలాలవద్ద ఎలాంటి దొంగతనాలు, దోపిడీలు జరగవని గ్రామస్తులు నమ్మకం.
- అప్పట్లో వరి ధాన్యం దొంగిలించేందుకు వచ్చిన వారుసైతం అక్కడే దొరికిపోయారని పలువురు గుర్తు చేసుకుంటారు.
- అమ్మవారికి మొక్కుకుంటే కోరికలు తీరుతాయని విశ్వాసం

రాతి స్తంభాలే ఆలయం.. మట్టి బొద్దులే అమ్మవారు

- కూకుట్లపల్లిలో వెలసిన బట్టమ్మదేవి ఆలయం రాతి స్తంభాల మధ్యలోనే ఉంది.
- నాలుగు వైపులా రెండు వరుసలలో రాతి స్తంభాలు ఉన్నాయి.
- గతంలో ఏర్పాటు చేసిన ఆలయం ప్రస్తుతం సైతం అలాగే ఉంది.
- రాతి స్తంభాల మధ్యలో చిన్నగోడలో మట్టి బొద్దులు (చిన్న గురుగులు)ను ఏర్పాటు చేసి దేవతలుగా కొలిచి పూజలు చేస్తున్నారు.
- మట్టి బొద్దులను ప్రతీ జాతరకు ఒకసారి కొత్తది ఏర్పాటు చేస్తారు. వాటినే దేవతగా పూజిస్తారు.
- ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు అనుకున్నా అమ్మవారు వద్దని చెప్పినట్లు ఆలయ పూజారులు చెప్పారు.
- ఎన్నోఏళ్లుగా గ్రామానికి చెందిన మాదర బోయిన, చెల్ల వంశస్తులు పూజలు చేస్తున్నారు.

గ్రామంలో 40 నుంచి 50 మంది వరకు బట్టమ్మ, బట్టయ్య పేర్లు

- కూకుట్లపల్లి గ్రామంలో వెలిసిన బట్టమ్మదేవి అమ్మవారు కోరిన కోరికలు తీర్చే దైవంగా ప్రజలు భావిస్తున్నారు.
- గ్రామస్తులు అమ్మవారి పేరును భక్తితో తమ సంతానానికి ఆడపిల్లలకు బట్టమ్మ అని, మగపిల్లలకు బట్టయ్య అని పేర్లుపెట్టుకున్నారు.
- ఇలా గ్రామంలో సుమారు 40 నుండి 50 మంది వరకు పేర్లు ఉన్నాయి.
- ప్రతీ కుటుంబంలో ఒకరికి పేర్లు ఉన్నాయి. దీంతో కొన్ని కుటుంబాలలో చిన్న బట్టయ్య, పెద్దబట్టయ్య అని మరికొందరిని ఇంటిపేరుతో సైతం పిలుస్తారు.



ఆలయంలో వెలసిన దేవతామూర్తులు (మట్టి బొద్దులు)

మొక్కు తీర్చుకున్నా

మా తల్లిదండ్రులకు చాలా వరకు సంతానం కలగలేదు. దీంతో పిల్లలు పుడితే నీపేరు పెట్టుకుంటానని మా నానమ్మ బట్టమ్మ తల్లికి మొక్కుకుందంట. దీంతో నేను పుట్టడంతో బట్టయ్య అని పేరుపెట్టారు. అమ్మవారి సన్నిధిలో పుట్టువెంట్రుకలు తీయించి మొక్కులు తీర్చుకున్నారు.

– జంగం బట్టయ్య, రిటైర్డ్ కండక్టర్ కూకుట్లపల్లి

మహిమగల తల్లి

మా గ్రామంలో వెలిసిన బట్టమ్మతల్లి అమ్మవారు మహిమగల తల్లి. గ్రామంలో ప్రతీ ఏడాది ఉగాది పండగకు అమ్మవారికి ఘనంగా జాతర నిర్వహిస్తాం. బండ్లు ఉరేగించి మొక్కులు తీర్చుకుంటాం. పండగను గ్రామస్తులంతా కలిసి ఘనంగా జరుపుకుంటాం. చుట్టుపక్కల గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

– సుజాత కాంతారావు, సర్పంచ్ కూకుట్లపల్లి

విద్యార్థినిని చితకబాదిన టీచర్

- హోంవర్క్ చేయలేదని కొట్టడంతో తల్లి ఆగ్రహం
- పటాన్‌చెరు వాట్సాప్ గ్రూపులో వైరల్
- ఘటనపై స్పందించి స్కూల్‌కు నోటీసు జారీ



విద్యార్థిని రితిక చేతిపై గాయాలు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థిని హోంవర్క్ చేయలేదని ఓ టీచర్ చితకబాదిన సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. మంగళవారం విద్యార్థిని తల్లి సరస్వతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణం నాయికోటి బస్తీకి చెందిన సరస్వతి కూతురు రితిక పట్టణంలోని ఫాదర్ స్కూల్ (ఎస్టీ జోసెఫ్ హై స్కూల్)లో థర్డ్ క్లాస్ చదువుతోంది. రితిక సోమవారం హోంవర్క్ చేయలేదని టీచర్ సూర్యకళ వాతలు తేలేలా విద్యార్థినిని చితకబాదింది. కూతురి చేతిపై గాయాలను చూసి తల్లి స్కూల్‌కి వెళ్లి యజమాన్యంతో పాటు ఉపాధ్యాయురాలిని నిలదీసింది. హోంవర్క్ చేయకుంటే తల్లిదండ్రులకు చెప్పాలని, మరి ఇంతలా కొట్టడం దారుణమని మండిపడింది. విద్యార్థిని తల్లి ఉపాధ్యాయురాలిని ప్రశ్నిస్తున్న వీడియో వాట్సాప్‌లో వైరలైంది. సమాచారం తెలుసుకున్న ఎంఈఓ పీపీ రాథోడ్ ఘటనపై ఆరా తీసి స్కూల్ కు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఢీకొట్టిన టిప్పర్



టైర్ల కింద వృద్ధురాలి మృతదేహం

తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఎస్‌బీఐ సమీపంలో గుడిసెలో నివాసం ఉంటున్న వృద్ధురాలు సందల్(70) మంగళవారం ఇస్నాపూర్‌లో రోడ్డు దాటుతోంది. ఈక్రమంలో సంగారెడ్డి వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి

- 98 శాతం సాధించిన వారికి నగదు ప్రోత్సాహం
- ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ ప్రభాకర్



ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌సీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీఓ (రీజనల్ కోఆర్డినేటర్) ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కౌడిపల్లి మండలం తునికి వద్దగల ఎంజేపీబీసీ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎంజేపీ ఆధ్వర్యంలో 29 గురుకుల పాఠశాలలు, 14 ఇంటర్ కళాశాలలు, 2 డిగ్రీ కళాశాలలు ఉన్నాయన్నారు. ఇందులో 1,778 పదో తరగతి, 2,172 మంది ఇంటర్, 843 మంది డిగ్రీ చదువుతున్నట్లు చెప్పారు. వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో 98 శాతం పైగా మార్కులు సాధించే వారికి రూ 10 వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంటర్ వార్షిక పరీక్షలు పూర్తయిన వెంటనే బాలికలకు వర్గల్‌లో, బాలురకు హైదరాబాద్‌లో నీట్, ఎంసెట్, ఐఐటీ కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ)లో ప్రభుత్వం కోచింగ్ ఇస్తుందన్నారు. ఇప్పటికే 8వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి, 9వ తరగతి వారికి 10వ తరగతి సిలబస్ ప్రారంభించామన్నారు. క్యాక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, పీడీ రాజన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



కొట్టె కనకయ్య (ఫైల్)

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులు తాళలేక, కుటుంబ పోషణ భారమవడంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటకు చెందిన కొట్టె కనకయ్య (32) గంగిరెద్దులను ఆడిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య దుర్గవ్వ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంపాదన చాలకపోవడంతోటు కుటుంబ పోషణ భారం కావడంతో తరుచూ భార్యతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి ఇంట్లో అందరు నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తెల్లవారు జామున భార్య ఉరి వేసుకున్న భర్తను చూసి చుట్టుపక్కల వారిని పిలిచి వారి సాయంతో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిక్షించిన వైద్యులు అప్పటికే కనకయ్య మృతి చెందినట్లు చెప్పారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కష్టపడితే విజయం మీదే

సిద్దిపేటజోన్: పట్టుదలతో కష్టపడితే ఉద్యోగం సాధించడం సులువని అడిషనల్ డీసీపీ మహేందర్ అన్నారు. మంగళవారం బీజేఆర్ భవన్‌లో పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. చివరి మెట్టులో ఉన్నారని, విజయం సాధించే వరకు మీకు తోడు ఉంటామన్నారు. మంత్రి హరీశ్‌రావు, పోలీస్ కమిషనర్ శ్వేత ప్రత్యేకంగా శిక్షణ ఏర్పాట్లు చేయడం జరిగిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

మహారాష్ట్ర వాసిగా గుర్తింపు

జోగిపేట(అందోల్): రోడ్డు ప్రమాదంలో నేషనల్ హైవే పనులు చేస్తున్న కూలీ మృతి చెందాడు. మంగళవారం ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ సామ్యానాయక్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్ మండలం ఎర్రారం గ్రామ శివారులో సోమవారం రాత్రి ఎన్‌హెచ్ 161లో పనులు ముగించుకొని తోటికూలీ రేవ ప్రసాద్‌తో కలిసి క్యాంపునకు వెళ్తున్నాడు. ఈక్రమంలో సంగారెడ్డి నుంచి పెద్దశంకరంపేట వెళ్తున్న మారుతీ సుజూకీ కారు ఢీకొట్టడంతో సునీల్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు అనిల్‌కుమార్ మంగళవారం ఉదయం జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొడెకల్ గ్రామానికి చెందిన గోవర్ధన్ కారు అజాగ్రత్తగా నడపడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మధ్యప్రదేశ్ తీసుకువెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

మేకులు మింగి.. తప్పించుకుని..

- సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి నుంచి రిమాండ్ ఖైదీ పరారీ
- సెంట్రీ నిర్లక్ష్యమే అంటున్న అధికారులు



నిందితుడు అరవింద్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : మేకులు (స్క్రూలు) మింగిన ఓ రిమాండ్ ఖైదీని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా సెంట్రీ కళ్లు గప్పి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన సీహెచ్.అరవింద్ పలు దొంగతనం కేసుల్లో నిందితుడు. అతడిని కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేయగా, ఖమ్మం జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన ఓ దొంగతనం కేసులో పీటీ వారెంట్‌పై తీసుకువచ్చిన పోలీసులు సంగారెడ్డి సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. అరవింద్ శనివారం జైలులో మేకులు మింగడంతో జైలు అధికారులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మేల్ సర్జికల్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాత్‌రూంకు వెళ్లి వస్తానని చెప్పిన అరవింద్ బాత్‌రూంలో ఉన్న కిటికీ ఊచను తొలగించి అందులోంచి పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు సంగారెడ్డిటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పరారీలో ఉన్న అరవింద్‌ను పట్టుకునేందుకు మూడు బృందాలను నియమించినట్లు పోలీసులు తెలిపారు. అరవింద్‌పై తొమ్మిది కేసులు ఉన్నాయి.

జైలులో మేకులెలా దొరికాయి?

సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అరవింద్‌కు జైలులో మేకులు ఎలా దొరికాయనేది ప్రశ్నార్థకంగా మారింది. జైలులో ఉండే స్విచ్‌బోర్డుకు ఉన్న స్క్రూలను మింగినట్లు జైలు అధికారులు భావిస్తున్నారు. అరవింద్ కడుపు నొస్తుందని జైలు అధికారులకు చెప్పగా అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ఎక్స్‌రే తీయడంతో ఆయన కడుపులో రెండు మేకులు ఉన్నట్లు గుర్తించారు. అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో సెంట్రీ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే అరవింద్ తప్పించుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. రిమాండ్ ఖైదీలు బాత్‌రూం వెళితే తప్పనిసరిగా చేతులకు గొలుసులు వేయాల్సి ఉంటుంది. అయితే ఏఆర్ పోలీసుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అరవింద్ పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్, ✆ 9319814720.
[T-1196145]

LOST

■ దారం వసంత భర్త ధర్మారెడ్డి, గ్రామం కల్లెపల్లి, మం. బెజ్జంకి, సిద్దిపేట జిల్లా. నా యొక్క స్టార్స్ మల్టీ పర్పస్ కార్పొరేటివ్ సొసైటీ లిమిటెడ్ కు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ నెంబర్. STAR-64 (SMC SL)A/c.No.56757000121, కల్లెపల్లి నుండి బెజ్జంకి ఆటోలో వెళ్తుండగా పోయినది. దయచేసి దొరికిన వారు ఈ క్రింది నంబర్‌కు తెలుపగలరు. ఫోన్ : 9908692328
[H-1222395]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586
[G-795231]

■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:16K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258889.
[H-786849]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

సదాశివపేట(సంగారెడ్డి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురికి అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం పట్టణంలోని సిద్దాపూర్ కాలనీలో సేరుగు కిరణ్‌కుమార్ ఇంటిలో సేరిగూడ కిరణ్‌కుమార్, మొగుడంపల్లి వెంకటేశం, మొల్లోల్లా రాజు, ఎన్కతల సాయిరాజ్, మాడపాటి శివకుమార్, బచ్చు పండరి, కుప్పనగారం కిరణ్‌కుమార్ పేకాట ఆడుతున్నట్లు పోలీసులు తెలిసింది. దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,00,500 నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గౌరయపల్లిలో తిరుపతిరెడ్డికి చెందిన మామిడి తోటలో గుట్టు చప్పుడు కాకుండా మూడు రోజులుగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్కఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. వారిని కొమురవెల్లి ఎస్‌ఐ చంద్రమోహన్ యాదవ్‌కు అప్పగించారు. మొత్తం 12 మందిని అరెస్టుచేశారు. వారి నుంచి రూ.1,19,000 వేల నగదు, మూడు కార్లు, 1 బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అదుపుతప్పిన కారు బోల్తా

- తప్పిన ప్రమాదం
- రెండు రోజుల్లో రెండో ప్రమాదం



పొలంలో బోల్తాపడిన కారు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు మరమ్మతుల్లో భాగంగా వేసిన కంకరపై వెళ్తున్న కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి శివారులో చోటుచేసుకుంది. వైద్యం చేయించుకునేందుకు మంగళవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన జగదీశ్ చౌదరి కుటుంబ సభ్యులతో కలిసి కారులో మిర్జాపల్లిలోని ఆయుర్వేద ఆస్పత్రికి వస్తున్నాడు. కంకర రోడ్డుపై వాహనం అదుపు తప్పడంతో రోడ్డు దిగువకు దూసుకుపోయింది. దీంతో కారులో ఉన్న జగదీష్ చౌదరి, సర్వన్, దినేష్, ఉష, సంగీత, లలిత, భావనకు స్వల్పగాయాలయ్యాయి. చిన్నశంకరంపేట నుంచి నార్సింగి జాతీయ రహదారిని కలిపే ఈ రోడ్డు మరమ్మతులు నత్తనడకన సాగుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ వాసులు ప్రమాదానికి గురయ్యారు. రెండు రోజుల వ్యవధిలో మరో ప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు.

యాత్రను జయప్రదం చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్‌జోన్: కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య బస్సుయాత్ర ఈనెల 25వ తేదీన మెదక్ జిల్లాలోకి ప్రవేశిస్తుందని, ఈయాత్ర జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం కోరారు. మంగవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోందని, ఐక్యంగా ఎదుర్కొనేందుకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రో ధరలు మూడు రెట్లు పెంచారని మండిపడ్డారు. 2014లో రూ. 410 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1350కి పెరిగిందన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జిల్లా నాయకులు బట్టి భూపతి, టీడీపీ జిల్లా నాయకుడు కరీం, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు దేవయ్య, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ ఫుడ్‌తో పలువురికి అస్వస్థత



నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న సీతారాంపూర్ గ్రామానికి చెందిన యువకులు

నర్సాపూర్: ఓ హోటల్‌లో బిర్యాని తినడంతో పలువురు అస్వస్థతకు గురై చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన పవన్, అరవింద్, మహేందర్ ఈనెల 18వ తేదీ రాత్రి నర్సాపూర్‌లోని ఓ మండి హోటల్‌లో మండి బిర్యాని పార్శిల్ తీసుకెళ్లి తిన్నారు. అలగే నర్సాపూర్‌కు చెందిన అజీజ్ మరో ఆరుగురు మిత్రులతో కలిసి అదే మండి హోటల్ తిని అస్వస్థతకు గురయ్యారు. ఇదిలాఉండగా నర్సాపూర్‌కు చెందిన మహేశ్, షకీల్, నాని కూడా అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలు కావడంతో మహేశ్ ఆదివారం రాత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. మిగిలిన వారు ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జానజీంబేగ్‌ను అడగ్గా ఫుడ్ పాయిజన్‌తో వారికి వాంతులు విరేచనాలు అయ్యాయని చెప్పారు.

శాంపిల్స్ సేకరణ

నర్సాపూర్‌లోని మన్నత్ అరేబియన్ మండి హోటల్ నుంచి పలు శాఖల అధికారులు శాంపిల్స్ సేకరించినట్లు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత తెలిపారు. మన్నత్ మండి హోటల్ బిర్యాని తిన్న పలువురు యువకులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, వైద ఆరోగ్య శాఖ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయనిర్మల, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తదితరులు మంగళవారం హోటల్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ హోటల్‌లో వాడుతున్న పదార్థాలను పరిశీలించడంతో పాటు కొన్ని శాంపిల్స్ సేకరించారు. తాము సేకరించిన శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామని, ఆ నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. హోటల్‌లో అధికారులు కలియ తిరిగారు.



వంటలో వినియోగించే పదార్థాలను పరిశీలిస్తున్న ఆయా శాఖల అధికారులు